వైకుంఠ ఏకాదశి బ్రోచర్ విడుదల



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దేవాలయం పూజారులు

చార్మినార్: ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఇప్పటికే తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చార్మినార్ చౌక్ మైదాన్‌లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన పూజారి శృంగారం రమణాచార్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పూజారి శృంగారం ఆత్రేయాచార్యులుతో కలిసి ముక్కోటి ఏకాదశి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు వచ్చే నెల 16 వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో గోవిందాచార్యులు, రాధేశ్యాం అగర్వాల్,శ్రీనివాస్ బన్సల్,రాజేందర్ కుమార్ పిత్తి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు


ఆలయ శిఖరం, మండప అలంకరణ ఏర్పాట్లు

జియాగూడ: జియాగూడలోని చారిత్రాత్మకమైన శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి ఏర్పాట్లు, అలంకరణలు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయం 400 సంవత్సరాల పురాతనమైనది. ఈ ఆలయం శ్రీరంగం పోలిన ఆకారంలో రంగనాథ స్వామి కొలువుదీరి ఉన్నారు. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతాయి. నగరం నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రతి సంవత్సరం ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. వైకుంఠ ఏకాదశి ఈ నెల 23న పురస్కరించుకుని ఈ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.


కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి


ఉత్తర ద్వార దర్శన మండపం


ఆహ్వాన పత్రికను అందజేసిన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వినోద్ చౌగ్లే

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం

ఈ నెల 23న జరిగే జియాగూడ వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వినోద్ చౌగ్లే మంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రిని కలిసి ఉత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. టీపీసీసీ కార్యదర్శి రాజేందర్ యాదవ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, జియాగూడ కాంగ్రెస్ నాయకులు అభిషేక్ చౌగ్లే తదితరులు పాల్గొన్నారు.

శివ నాగలింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు



గౌలిపురా : సుబ్రమణ్య స్కంద షష్టిని పురస్కరించుకొని సోమవారం గౌలిపురా డివిజన్ వివేకనందనగర్‌లోని శివ నాగలింగేశ్వర దేవాలయంలో దేవాలయం ధర్మకర్త ఎస్‌బీ గౌరీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లావణ్య, యాదయ్య, పూజారి సురేందర్ తదితరుల పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం



చార్మినార్: మీరాలం మండి మహాంకాళేశ్వర దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం సోమవారం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య కుటుంబ సభ్యులు సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పాతబస్తీ అభివృద్ధి


బోర్‌వెల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పాతబస్తీ అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ అన్నారు. న్యూ ఇంద్రానగర్‌లోని బోలేనాథ్ దేవాలయంలో నూతనంగా వేసిన బోర్‌వెల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పాతబస్తీ అభివృద్ధి కోసం రూ.2 వేల కోట్లు మంజూరరయ్యాయన్నారు. పాతబస్తీలో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం కూడా చేశామన్నారు. కార్యక్రమంలో స్థానికులు సి.యాదయ్య, డి.రాజు, రవీందర్, శ్రీహరి, అశోక్, శివకుమార్, యాదగిరి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానాన్ని అర్థం చేసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న స్వామి బోధామయానంద మహరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు

గోల్కొండ: దేశంలో చోటు చేసుకుంటున్న ప్రాంతీయ రాజకీయాలు, కుల, మత భాష రాజకీయాలు మన మనస్సులను కలుషితం చేస్తున్నాయని రామకృష్ణ మఠం వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ డైరెక్టర్ స్వామి బోధామయానంద మహరాజ్ అన్నారు. షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత ప్రాంతీయ భాషా రాజకీయాలు ఇటీవల కాలంలో భారత దేశాన్ని చాలా ప్రభావితం చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపి 2020)ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని అన్నారు. భారతీయ విజ్ఞాన వ్యవస్థపై అవగాహన ఉండడం నేటి అవసరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ మాధవీలత, కన్వీనర్ వి.జాహ్నవితో పాటు కోకన్వీనర్ డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్, రవీందర్

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నిలోఫర్ ఆసుపత్రి ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు డి.రవీందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్, శ్రీనివాస్ మాట్లాడుతూ... ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. జి.ఓ నెం.60 ప్రకారం... పేషంట్ కేర్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ శానిటేషన్ సిబ్బందికి రూ.15,600 చెల్లించాలని, ఏడాదికి పన్నెండు క్యాజువల్ సెలవులు, మహిళా సిబ్బంది ఐదు స్పెషల్ క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య శ్రీ కింద డేటా ఎంట్రీ చేసే సిబ్బందికి 30 శాతం ఇంక్రిమెంట్‌ను న్యాయపరంగా అందించాలని కోరారు. అలాగే ప్రతి నెలా ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యలపై సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

తొమ్మిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్

అబిడ్స్: ఓ యువకుడు చదువు మానేసి ద్విచక్రవాహనాలు దొంగిలిస్తూ కటకటాలు పాలయ్యాడు. సోమవారం అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.నర్సింహులతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. టోలీచౌకీ ప్రాంతానికి చెందిన షేక్ జునయిద్ (20) డిగ్రీ మధ్యలో ఆపేశాడు. రద్దీ ప్రాంతాల్లో, వ్యాపార వాణిజ్య సముదాయాల వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాలపై కన్నేస్తాడు. తన దగ్గర ఉన్న తాళంచెవిలతో పాటు ముందుగా ప్రయత్నం చేసి ఒక వేళ ద్విచక్ర వాహనం తాళం తెరుచుకోకపోవడంతో కాలుతో బలంగా వాహన హ్యాండిల్‌ను తన్ని ఆ వాహనంతో పరారవుతాడు. ఇలా కొన్ని నెలలుగా అబిడ్స్, బేగంబజార్, చార్మినార్, ఫిల్మ్‌నగర్, హబీబ్‌నగర్, అత్తాపూర్, నార్సింగి పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లో తొమ్మిది ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన వెంటనే ఒక రోజు ఆ వాహనంపై తిరిగి ఏదో ఒక ప్రాంతంలో ఆ వాహనాన్ని వదిలేసి వెళ్లడం అతనికి హాబీగా మారింది. ఆదివారం బొగ్గులకుంట ప్రాంతంలో అబిడ్స్ పోలీసులు నిందితుడు షేక్ జునయిద్‌ను అనుమానంతో పోలీసులు తనిఖీ చేసి విచారించడంతో తాను దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. తొమ్మిది ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనపరచుకున్నారు. ఈ కేసును క్రైమ్ ఎస్ఐ.సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నం

– నిందితుడి అరెస్ట్

సుల్తాన్‌బజార్: ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఓ యువకుడిని సుల్తాన్‌బజార్ పోలీసులు కటకటల్లోకి నెట్టారు. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన మేరకు.. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే వ్యాపారి తన కుమార్తె (14)ను ఇంట్లో వదిలి వెళ్లారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ప్రేమ్‌సింగ్ (21) బాలిక ఒంటరిగా ఉందని గమనించి ఇంట్లోకి దూరి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు వచ్చి బాలికను రక్షించారు. దీంతో నిందితుడు పరారయ్యాడు. కుటుంబ సభ్యులు సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం



చాంద్రాయణగుట్ట: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఆట బొమ్మల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బీబీ కా చష్మా రోడ్డులో మహ్మద్ గౌస్ అనే వ్యక్తి ఆట బొమ్మల విక్రయ దుకాణాన్ని నడుపుతున్నాడు. సోమవారం ఉదయం విద్యుదాఘాతం కారణంగా మంటలంటుకున్నాయి. ఈ మంటలలో దుకాణంలోని వస్తువులు కాలిపోయాయని.....రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రైవేట్ ప్లే ఎక్విప్‌మెంట్ ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోగల గంధంగూడ, రంగారెడ్డినగర్ కాలనీలలో ప్రైవేట్ ప్లే ఎక్విప్‌మెంట్‌ను సోమవారం ప్రారంభించారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి మాట్లాడుతూ.. యువకులు, విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ఈ ప్లే గ్రౌండ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి అందరికీ కావాల్సిన సౌకర్యాలను కల్పించామన్నారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బొర్ర రాందాస్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్, భూపాల్‌గౌడ్, అస్లాం బిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్ సీనియర్ నాయకులు నాగరాజు, సయ్యద్ ఖాజా, ప్రేమ్‌గౌడ్, చేగూరి రాజు, గంగని రవి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు అయోధ్య రామాక్షితలు


అయోధ్య నుంచి వచ్చిన రామాక్షితలతో భక్తులు

విజయనగర్‌కాలనీ: అయోధ్య రామాక్షితలు నగరానికి వచ్చాయి. విజయనగర్ కాలనీ రామాలయానికి రామమందిర నిర్మాణ పూజాక్షితలు చేరుకున్నాయి. ఆలయ ప్రతినిధులు స్వాగతం పలికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం అక్షితలను రామాలయంలోకి శోభాయాత్రగా తీసుకువెళ్లారు. అయోధ్య రామాక్షితలను జనవరి 1వ తేదీ నుంచి గడప గడపకు అందజేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు విశేష జనసంపర్క అభియాన్ ప్రభారి భూపతి వెంకటేష్, సంయోజకులు శివకోటి, సహ సంయోజకులు సాయివరప్రసాద్, ఊటుకూరు కాళింది జె.శివరావులు తెలిపారు. జనవరి 22న శ్రీరామ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం ఈ అక్షితలను అందరూ తలమీద వేసుకోవాలని తెలిపారు.

స్పీకర్‌కు సన్మానం



చార్మినార్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమర్‌ను పాతబస్తీకి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు కప్ప కృష్ణా గౌడ్ తదితరుల బృందం మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ చాంద్ తదితరులున్నారు.

రూ. 32.13 లక్షలతో అభివృద్ధి పనులు


డ్రైనేజీ లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: ప్రజల ఆరోగ్యం కోసం డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లి గ్రామం శాంతినగర్‌లో సోమవారం రూ.32.13 లక్షలతో డ్రైనేజీలైన్ పనులను కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎక్కడైతే మురుగు సమస్య ఉందో అక్కడ తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మురుగు రోడ్లపై వెళ్లకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్, సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్‌రెడ్డి, అనుముల జాన్‌పాల్, సీహెచ్.శ్రీవర్ధన్‌రెడ్డి, రగడంపల్లి శ్రావణ్‌కుమార్, కోరని రవీందర్, దేవదాస్, పట్నం నరేష్, జబీన్ హుస్సేన్, మోహన్‌రెడ్డి, పెంజర్ల మోహన్, గిరిబాబు, అరింట్ల విశాల్, వడ్లకొండ సురేష్, మహేష్, ఆదిరాల అరుణ్‌బాబు, చిన్న, సంతోష్, వెంకటేష్, రాజు, దుర్గస్వామిదాస్, లింగాల రాకేష్, మనోహర్, ప్రమీల, ఇందిర, జయమ్మ పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం


కాలనీవాసులతో మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ ఆదర్శనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో చెత్త సేకరణ ఆటోలు, ఓపెన్ పాయింట్లు, తాగునీటి సమస్య, విద్యుత్ తదితర వాటిని తెలుసుకునేందుకు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ప్రజలు చెత్త చెదారాలు రోడ్లపై వేయకుండా అవగాహన కల్పించారు. చెత్త సేకరణలో ఆటో రిక్షా కార్మికులు నిర్లక్ష్యం వహించకూడదని, తమకు కేటాయించిన కాలనీలు, బస్తీల్లో రోజూ తిరుగుతూ.. ఇంటింటికి వెళ్లి చెత్తను తీసుకోవాలన్నారు. ఇళ్ల మధ్యలో చెత్తకుండీలు ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురౌతున్నారన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనిచేయని వీధి దీపాలను పూర్తిగా తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. జవాన్ నవీన్, జలమండలి లైన్‌మెన్ పెంటయ్య, ఎలక్ట్రీషియన్ శివ తదితరులున్నారు.

వైభవంగా దేవాలయ వార్షికోత్సవం



గోల్కొండ: కార్వాన్‌లోని శ్రీ శివమార్కండేయ దేవాలయ 13వ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ పూజలు మృత్యుంజయ రాజ శ్యామల యాగం శ్రీ బాలమార్తండ మాణిక్ ప్రభు మహరాజ పర్యవేక్షణలో జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ పూజల్లో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి పద్మశాలి కుటుంబ సమేతంగా వచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, దేవాలయ చైర్మన్ తాటిపాముల నర్సింగ్‌రావు, చరణ్‌రాజ్, గోపాల్, మన్మోహన్, టి.బాలరాజ్, దేవర మహేష్‌తో పాటు మార్కండేయ భవన ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ నిరాకరించడం అమానవీయం

నాంపల్లి: ముప్పై ఏళ్ల పాటు సేవలందించిన ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం సామాజిక బాధ్యత అని, పెన్షన్ నిరాకరించడం అమానవీయమని తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. సోమవారం రాత్రి నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగిన పెన్షనర్ల దినోత్సవానికి హాజరైన ఆయన పెన్షనర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఉద్యోగుల పోరాటాల ఫలితంగా పెన్షన్ సౌకర్యం సాధించుకున్నారని గుర్తు చేశారు. సరళీకరణ తర్వాత అనేక మార్పులు వచ్చాయని, పెన్షన్ ఇచ్చే బాధ్యత నుంచి ప్రభుత్వాలు తప్పుకోవడం తగదన్నారు. పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) పునరుద్ధరణకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని హామీనిచ్చి ఎన్నికల ప్రణాళికలో సైతం పొందుపర్చిందని గుర్తు చేశారు.


వేడుకగా సుబ్రమణ్య షష్టి


కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో సుబ్రమణ్య షష్టి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. సుబ్రమణ్య షష్టి సందర్భంగా స్వామివారికి తెల్లవారుజామునే పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం కనుల పండువగా నిర్వహించిన స్వామివారి కల్యాణ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అరకొర బస్సులతో పరేషాన్

గోల్కొండ, షేక్‌పేట్‌కు బస్సులు అంతంతే..



గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండతో పాటు షేక్‌పేట్‌కు ఆర్టీసీ బస్సులు అరకొరగానే ఉన్నాయి. గతంలో అఫ్జల్‌గంజ్, చార్మినార్, మెహిదీపట్నం నుంచి గోల్కొండ కోట, షేక్‌పేట్ వరకు బస్సు సర్వీసులు ఉండేవి. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ బస్సులలో ఆక్యూపెన్సీ ఎక్కువగా ఉండేది. అయితే వివిధ కారణాల వల్ల ఆర్టీసీ అధికారులు క్రమేణా ఈ బస్సు సర్వీసులను తగ్గిస్తు వచ్చారు. కరోనా సాకుతో దాదాపు అన్ని సర్వీసులను ఉపసంహరించుకున్నారు. పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు ప్రతినిత్యం నగరంలోని ప్రధాన బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గోల్కొండ కోటలో కొలువుదీరిన శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవార్ల దర్శనం కోసం కూడా భక్తులు ప్రతినిత్యం వస్తుంటారు. చార్మినార్, అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి గోల్కొండ కోటకు వచ్చే బస్సులు వీరికి అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం సమయంలో మాత్రమే బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. గత్యంతరం లేక ప్రయాణీకులు ఆటోలలో వస్తున్నారు. అదే విధంగా షేక్‌పేట్ నుంచి సైతం గతంలో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో అఫ్జల్‌గంజ్, చార్మినార్ నుంచి షేక్‌పేట్‌కు 80ఎస్, 65ఎస్, 65సి, బస్సులు అందుబాటులో ఉండేవి. ఈ బస్సులు గోల్కొండ మీదుగా రాకపోకలు సాగించేవి. ఈ బస్సులను రద్దు చేయడంతో గోల్కొండ, షేక్‌పేట్, తూమ్స్ చౌరస్తా, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాలకు చెందిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 65ఎం, 65ఎస్, 80సి బస్సులను పునరుద్ధరించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరుతూ ఉత్తరం రాశారు. అయితే ఆర్టీసీ అధికారులు ఇప్పటి వరకు స్పందించలేదు. ఇదిలా ఉండగా వారపు సంతలకు వచ్చే చిరు వ్యాపారులు సైతం గోల్కొండ, షేక్‌పేట్‌కు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు షేక్‌పేట్ నుంచి గోల్కొండ ఏరియా ఆసుపత్రికి వచ్చే పేషంట్లు సైతం ప్రైవేటు ఆటోలలో వస్తున్నారు. కొందరు ప్రయాణీకులు గోల్కొండ నుంచి లంగర్‌హౌజ్ వరకు వెళ్లి అక్కడ నుంచి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. అయితే షేక్‌పేట్, గోల్కొండ తదితర ప్రాంతాల వారు బస్సులు లేక ఉచిత బస్సు ప్రయాణాన్ని వదులుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు ఇకనైనా స్పందించి రద్దు చేసిన బస్సులను పునఃప్రారంభించడమే కాక మెహిదీపట్నం, సికింద్రాబాద్ నుంచి గోల్కొండ మోతీదర్వాజ వరకు 65ఎం బస్సు సర్వీసును వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'తో ఉపయోగం

ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ సాయిరామకృష్ణ

మణికొండ: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనేది మన జీవన నాణ్యతను మెరుగుపరచటానికి, సమాచారాన్ని సేకరించి ప్రాసెస్ చేసి అందించే బిలియన్ల కొద్ది పరికరాల నెట్‌వర్క్ వేగంగా అభివృద్ధి చెందుతుందని, దీంతో సమాజానికి ఎంతో ఉపయోగమని ఐఐటీ హైదరాబాద్ మెటీరియల్స్ సైన్స్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ సాయిరామకృష్ణ అన్నారు. సీబీఐటీలో సోమవారం నుంచి ఈనెల 23 వరకు కొనసాగే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్నెట్ రంగంతో పారిశ్రామిక యంత్రాలు, వైద్య పరికరాలను సైతం అనుసంధానం చేస్తున్నారన్నారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. 5.0 కోణంలో ఐఓటీ, సెన్సార్ల ప్రాముఖ్యతను వివరించారు. మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీపీ కో- ఆర్డినేటర్లు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సోలమన్ రాజ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి


కౌన్సిలర్ యాదమ్మకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

మణికొండ: మహిళలకు అనుకూలంగా ఉండేలా అదనపు బస్సు సర్వీసులను పెంచాలని వట్టినాగులపల్లి డ్వాక్రా సంఘాల మహిళలు కౌన్సిలర్ యాదమ్మకు వినతిపత్రం అందజేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి కౌన్సిలర్‌ను కలిసి వారు గ్రామానికి కేవలం పాఠశాల విద్యార్థులకు ఉదయం సమయంలోనే బస్సులు నడుస్తున్నాయని వివరించారు. సాయంత్రం వరకు బస్సులు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మరిన్ని బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ మాట్లాడుతూ.. గ్రామ మహిళల డిమాండ్‌ను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అదనపు బస్సులను నడపాలని చెబుతామన్నారు.